సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 13 । జనవరి । 2023



అక్రమ నిర్మాణాలపై ఆర్డీఓ ఆగ్రహం

కోళ్లబైలు పంచాయతీలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై ఆర్డీఓ ఎం.ఎ స్.మురళీ ఆగ్రహం వ్యక్తం చేశారు. -IIలో..



ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ బ్యాంకు లక్ష్యమని ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.160	రూ.200
రెండోరకం	రూ.90	రూ.158



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 195 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	640	677
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 250.44 కిలోలు

కొనుగోళ్ల జోరు..!

- వరుసగా మూడురోజులపాటు పండుగ వాతావరణం
- రేపు భోగి పండుగ నేపథ్యంలో కిటకిటలాడుతున్న మార్కెట్లు
- కొనుగోలుదారులతో రద్దీగా దుకాణాలు
- ఆర్టీసీ బస్సుల్లోనూ మొదలైన ప్రయాణాలు
- ఆట పాటలతో గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఉత్సాహం

సాక్షి,రాయచోటి: సంక్రాంతి సందడి ప్రారంభమైంది. ఎక్కడ చూసినా కొనుగోళ్లతో పట్టణాలు సందడిగా మారాయి. జనవరి మాసంలో వచ్చే తొలి పండుగ. కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి జరుపుకునే పండుగ కావడంతో కొత్త వాతావరణం కనిపిస్తోంది. వరుసగా భోగి, సంక్రాంతి, కనుమ పండుగలకు దూర ప్రాంతాల్లో ఉన్న వారు కూడా ప్రణాళిక ప్రకారం స్వస్థలాలకు వస్తుండడంతో పల్లె లోగిళ్లు కళకళలాడుతున్నాయి. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా రంగవల్లులతో పాటు ఆటపాటలతో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది.

కొనుగోళ్ల సందడి

అన్నమయ్య జిల్లాలో రాయచోటి, మదనపల్లె, రాజంపేటల్లో ప్రధాన మార్కెట్లు జనంతో రద్దీగా మారాయి. వస్త్రదుకాణాలు, బంగారు నగల దుకాణాలు, పాదరక్షలు, రెడీమేడ్ దుస్తులు, నిత్యావసరాల దుకాణాలు, ఫ్యాన్సీ సామగ్రి కొనుగోలుతో ఎక్కడ చూసినా షాపులు కిటకిటలాడుతున్నాయి. షాపుల వద్ద సందడి వాతావరణం కనిపిస్తోంది. దాదాపు ప్రతి షాపులోనూ కొనుగోలుదారులతో



రాయచోటిలోని వస్త్ర దుకాణంలో ప్రజల రద్దీ

దుకాణదారులు బిజీగా కనిపిస్తున్నారు. రాయచోటిలోని బంగారు అంగళ్ల బజారు పూర్తిగా జనం రద్దీతో ట్రాఫిక్ స్తంభించింది. భోగి పండుగ నాడు చిన్నారులను కూర్చోబెట్టి రేగుపండ్లతో స్నానాలు చేయించే సంప్రదాయం ఉండటంతో పలువురు రేగి పండ్లను కొనుగోలు చేస్తుండడం కనిపిస్తోంది.

గ్రామీణ ప్రాంతాల్లో ఆటల పోటీలు

జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతిని పురస్కరించుకుని ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. క్రికెట్, రంగవల్లులు, టెంకాయ, బండరాయి, కోడిపందేలతో అక్కడక్కడా కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఇప్పటికే సాంప్రదాయ బద్ధంగా రాత్రిళ్లు, తెల్లవారుజామున భోగి మంటలు ప్రారంభమయ్యాయి.

ఆర్టీసీకి సంక్రాంతి తాకిడి

జిల్లాలోని రాయచోటి, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ఉపాధి, ఉద్యోగాల నేపథ్యంలో హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, విజయవాడ తదితర నగరాల్లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. అత్యంత వైభవంగా నిర్వహించే పండుగల్లో ఒకటైన సంక్రాంతికి దూర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు పయనమయ్యారు. ఇప్పటికే ఆర్టీసీ సంస్థ 40 ప్రత్యేక బస్సులను వివిధ నగరాల నుంచి ప్రయాణికులను తీసుకు వచ్చేందుకు నడుపుతోంది. ఇవే కాకుండా యథావిధిగా రోజువారి సాధారణంగా తిరిగే బస్సులు కూడా ఉన్నాయి. స్వస్థలాలకు వచ్చేవారితో ఆర్టీసీ బస్సులు రద్దీగా కనిపిస్తున్నాయి. ప్రజా రవాణా సంస్థ కూడా ప్రయాణికుల నుంచి ఎలాంటి అదనపు చార్జీలు లేకుండా ప్రజాసేవలో నిమగ్నమవుతుండడంతో అధిక సంఖ్యలో ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు చూపుతున్నారు. ఏది ఏమైనా సంక్రాంతి పండుగ నేపథ్యంలో పల్లెలు, పట్టణాల్లో పండుగ వాతావరణంతో కొత్త సందడి కనిపిస్తోంది.

పల్లెకు పోదాం.. చలో చలో

- దారులన్నీ గ్రామసీమలవైపే
- రేపటి నుంచే సంక్రాంతి వేడుకలు


రాజంపేట టౌన్: సంక్రాంతికి ఉన్న ప్రాముఖ్యత, ప్రాధాన్యత అనాదిగా కొనసాగుతూనే ఉంది. సంక్రాంతి ఒక పండుగ మాత్రమే కాదు. బంధువులు, ఆత్మీయుల కలయికకు ఓ వేదిక కూడా. కాలం సాంకేతికత వైపు పరుగెడుతున్నా పల్లె, పట్టణం అన్న తేడాలేకుండా నేటికి సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకుంటున్నారంటే అది పెద్దపండుగకు ఉన్న గొప్పతనమే అని చెప్పాలి. సరదాలు, ఆత్మీయ సమ్మేళనాలు కలగలిసిన పెద్ద పండుగ సందడి శనివారం నుంచి ప్రారంభం కానుంది.

దారులన్నీ సొంతూళ్ల వైపే

విద్యా సంస్థలకు సెలవులు వచ్చేశాయి. దీనికి తోడు పండుగకు సమయం ఆసన్నమైంది. దీంతో విద్యార్థులు, వివిధ ప్రాంతాల్లో ఉద్యోగ, వ్యాపార రీత్యా స్థిరపడ్డ ప్రజలు సొంతూళ్ల బాట పట్టారు. ఇప్పటికే అనేక మంది పల్లెలకు చేరడంతో గ్రామసీమలు కళకళలాడుతున్నాయి.

మదిలో మెదిలే జ్ఞాపకాలకు నెలవు ..

సంక్రాంతి జ్ఞాపకాల దొంతర. సంక్రాంతి సందర్భంగా పరమపదించిన పెద్దలకు, ఇతర కుటుంబ సభ్యులకు దుస్తులు పెట్టుకొని, సమాధుల వద్ద పూజలు నిర్వహిస్తారు. వారు తమతో గడిపిన మధుర క్షణాలను నెమరువేసుకుంటారు.



ఆత్మీయ కలయికలకు వేదిక

ప్రస్తుతం ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్ గ్రూపుల హవా నడుస్తోంది. అందువల్ల చిన్నప్పుడు కలిసి చదువుకున్న వారు, ఆటలాడుకున్న వారు తమ ఫొటోలను, వివరాలను ఫేస్‌బుక్‌లలో పెడుతున్నారు. దశాబ్దాల క్రితం విడిపోయిన చిన్ననాటి స్నేహితులను గుర్తు పట్టేందుకు ఫేస్‌బుక్ దోహదపడుతుండగా, గుర్తుపట్టిన చిన్ననాటి మిత్రులను వాట్సాప్ గ్రూపు ఒకటిగా చేస్తోంది. అలా ఒక్కటైన స్నేహితులు, ఆత్మీయుల కలయికకు సంక్రాంతి వేదిక కానుంది.

ఈ ఏడాది కొత్త అల్లుళ్లదే సందడి

గత ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో మంచి ముహూర్తాలు ఉన్న కారణంగా వేలాది వివాహాలు జరిగాయి. వివాహమైన తరువాత వచ్చే తొలి పండుగకు అల్లుళ్లు అత్తమామల ఇంటికి విధిగా వస్తారు. దీంతో ప్రతి గ్రామంలో కొత్త అల్లుళ్ల సందడి ఎక్కువగా ఉండనుంది. మొత్తానికి పల్లెసీమలు కళకళలాడుతున్నాయి.

చాలా హ్యాపీగా ఉంది



మేము హైదరాబాద్‌లో ఉంటాము. ప్రతి సంవత్సరం సంక్రాంతికి ఓబులవారిపల్లె మండలం ముక్కావారిపల్లెలోని నానమ్మ ఇంటికి వస్తాము. ఇక్కడ సంక్రాంతి పండుగ చాలా బాగా చేస్తారు. మేము బాగా ఆడుకుంటాము. అమ్మానాన్న కూడా ఏమీ అనరు. పండగ మూడు రోజులు ఫుల్ ఎంజాయ్ చేస్తాము. సంక్రాంతికి ఈ ఊరికి రావాలంటే నాకు చాలా హ్యాపీగా ఉంటుంది.

–తరుణ్, ఆరవ తరగతి విద్యార్థి, హైదరాబాద్

మనసు పులకించే పండుగ



సంక్రాంతికి బిడ్డలందరు వస్తారు. మూడు మూడు, నాలుగు రోజులు ఇళ్లే కాదు, ఊరు, ఊరు సందడిగా ఉంటుంది. ఊళ్లో కొంత మంది ఇళ్లకు బంధువులు వచ్చారు. వచ్చిన వారు వచ్చి పలకరించి పోతుంటే మనసు ఎంతో ఆనందంగా ఉంది. సంక్రాంతి మనసు పులకించే పండుగ.

–గంగమ్మ, తుమ్మల అగ్రహారం, రాజంపేట మండలం

పదపదవే వయ్యారి గాలి పటమా!

- ఉత్సాహం మాటున పొంచి ఉన్న ప్రమాదం
- పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన సమయం

రాజంపేట టౌన్: విద్యార్థులకు సంక్రాంతి సెలవులు వచ్చేశాయి. ఒకప్పుడు సెలవుల్లో విద్యార్థులు వివిధ రకాల ఆటలు ఆడుకునేవారు. అయితే ఇప్పుడు ఆయా పండుగలు, సీజన్‌లు బట్టి ఆడుకునేందుకు ఇష్టపడుతున్నారు. రెండు రోజుల్లో సంక్రాంతి వేడుకలు ప్రారంభం కానున్నాయి. సంక్రాంతి పండుగ సందర్భంగా పిల్లలు, విద్యార్థులు గాలిపటాలను ఎగరవేస్తారు. ప్రస్తుతం విద్యా సంస్థలకు సెలవులు ఇచ్చినందున పిల్లలు గాలిపటాలు ఎగరవేసేందుకు సిద్ధమయ్యారు. అనేక మంది ఇప్పటికే గాలి పటాలను సైతం తెచ్చిపెట్టుకున్నారు. పిల్లలు ఎక్కడపడితే అక్కడ గాలిపటాలను ఎగరవేస్తారు. వీధుల్లో, మేడలపై ఉండే పిట్టగోడల మీద నుంచి గాలిపటాలను ఎగురవేయడం శ్రేయస్కరం కాదు. పిల్లలను తల్లిదండ్రులు ఓ కంట కనిపెట్టుకుని ఉండాల్సిన అవసరం ఉంది.

ఇలాంటి జాగ్రత్తలు పాటించాలి

- వీధుల్లో, వాహనాలు వెళ్లే రహదారుల్లో ఎట్టి పరిస్థితుల్లో గాలిపటాలను ఎగురవేయరాదు.
- గాలిపటం తెగి ఎక్కడైనా పడిపోతే ఆ గాలిపటాన్ని తీసుకునేందుకు ముందు వెనకా చూసుకోకుండా పరిగెత్తకూడదు.
- ప్రస్తుతం అనేక చెరువుల్లో నీళ్లు ఉన్నాయి. అందువల్ల చెరువు గట్లపై గాలిపటాలు ఎగురవేయకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి.
- విద్యుత్‌లైన్లకు దగ్గరగా ఎట్టి పరిస్థితుల్లో గాలిపటాలను ఎగురవేయకూడదు.
- పొరపాటున గాలిపటం విద్యుత్ తీగకు తగులుకుంటే వెంటనే దారాన్ని వదిలివేయాలి.

ఇలాగైతే సేఫ్

- గాలి పటాలను ఆరుబయట, మైదాన ప్రాంతాల్లోనే ఎగురవేయాలి
- భవనాలపై పిట్టగోడలు ఎక్కువ ఎత్తులో ఉండి, విశాలవంతమైన భవనం పై గాలిపటాలు ఎగరవేస్తే సమస్య ఉండదు.
- ప్రధానంగా తల్లిదండ్రులు తమ పిల్లలు గాలిపటాలు ఎగరవేసేందుకు ఎక్కడికి వెళుతున్నారో తెలుసుకొని సురక్షితమైన ప్రాంతమైతేనే పంపాలి.
- వీలైతే పిల్లలకు దగ్గరుండి గాలిపటాలు ఎగరవేయిస్తే ఎలాంటి సమస్య ఉండదు.



గాలిపటాలను ఎగురవేస్తున్న విద్యార్థులు

న్యూస్‌రీల్

రాజంపేట సబ్‌కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



రాజంపేట: రాజంపేట సబ్ కలెక్టర్‌గా ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఇక్కడ ఆర్డీఓగా పనిచేస్తున్న కోదండరామిరెడ్డిని ప్రభుత్వ పరిపాలన విభాగంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశిస్తూ ప్రభుత్వం బదిలీ ఉత్తర్వులను విడుదల చేసింది.

కడప ఆర్జేడీగా బి.ప్రతాప్‌రెడ్డి

సాక్షి, కడప ప్రతినిధి: స్కూల్ ఎడ్యుకేషన్ కడప రీజియన్ ఆర్జేడీ(ఫుల్ అడిషనల్ చార్జ్)గా బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ ఆర్జేడీగా పని చేస్తున్న ఎం.వెంకట కృష్ణారెడ్డిని ఏపీ మోడల్ స్కూల్స్ జేడీగా బదిలీ చేశారు. ప్రస్తుతం బి.ప్రతాప్‌రెడ్డి ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌గా ఉన్నారు.

18న 'ఎస్సీ,ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్' డైరీ ఆవిష్కరణ

కడప రూరల్ : ఈ నెల 18న ఏపీ ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించనున్నట్లు ఆ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కేవీ రమణ తెలిపారు. కొత్త ఏడాదిలో కూడా అనేక కార్యక్రమాలకు రూప కల్పన చేస్తున్నట్లు పేర్కొన్నారు. అసోషియేషన్ సభ్యులు డైరీ ఆవిష్కరణ కార్యక్రమంను జయప్రదం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల్లో నాణ్యమైన ఆహారం అందించాలి



కలకడ అంగన్‌వాడీ కేంద్రంలో తనిఖీ చేస్తున్న జిల్లా ఫుడ్‌సేఫ్టీ అధికారి రామయ్య

కలకడ: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు అందించే ఆహారం నాణ్యతతో, రుచికరంగా ఉండాలని జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని కలకడ–2, 4, కె.బాటవారిపల్లెలోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ప్రతికేంద్రంలో గత మాసంలో సరఫరా చేసిన వస్తువులు ఏవీ నిల్వ ఉంచరాదని, ప్రభుత్వం నిర్ణయించిన మేరకు సకాలంలో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిశోరబాలికలకు మెనూ ప్రకారం అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది జయప్రదదేవి, సరళ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నివారణకు కృషి

కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: బాల్య వివాహాల నివారణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. గురువారం చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి ఎస్‌డీజీ గోల్స్, ఆరోగ్యం, స్త్రీ, శిశు సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు అంశాలలో ఎస్‌డీజీ సూచికలపై దృష్టి, స్కూలు ఎడ్యుకేషన్, పీఆర్‌అండ్‌ఆర్‌డీ తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ మాట్లాడుతూ ప్రభుత్వం రక్తహీనత లేని సమాజ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని అధికారులను ఆదేశించారు. సుస్థిర సమగ్రాభివృద్ధి లక్ష్యాలను వందశాతం సాధించేందుకు ప్రతి శాఖ తప్పనిసరిగా కృషి చేయాలన్నారు.



నిర్దేశించిన గడువులోగా రీసర్వే పూర్తి

నిర్దేశించిన గడువులోగా రీ సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. గురువారం విజయవాడలోని తన కార్యాలయం నుంచి సీసీఎల్‌ఏ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్ సంబంధిత శాఖల కార్యదర్శులతో కలిసి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష (సమగ్ర సర్వే) కార్యక్రమం అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నమయ్య జిల్లా మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజు తదితరులు పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, సిబ్బంది సమన్వయంతో రీ సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

వైభవంగా ఉరుసు ఉత్సవం

కడప కల్చరల్ : ప్రముఖ సూఫీ ఆధ్యాత్మిక క్షేత్రం, విశ్వవిఖ్యాత పర్యాటక ప్రాంతమైన కడప అమీన్ పీర్ (పెద్ద)దర్గాలో గురువారం హజరత్ దాదా ముర్షద్ అమీన్‌పీర్ సాహెబ్ వారి ఉరుసు ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అలంకరించిన కలశంలో గంధంతో దర్గా గురువులు హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ తమ స్వగృహం నుంచి ఫకీర్ల మేళతాళాలు, విన్యాసాల మధ్య దర్గాకు చేరుకున్నారు. తర్వాత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దర్గాలోని గురువుల మజార్‌వద్ద గంధం సమర్పించారు. ఫాతెహా నిర్వహించి భక్తులకు ప్రసాదాలను పంపిణీ చేశారు.

దురుద్దేశంతోనే తప్పుడు కథనాలు

- టీడీపీ నాయకుడు ఫిర్యాదు చేస్తే ఎల్లోమీడియా భుజానికి ఎత్తుకుంది
- మా గ్రామాల్లోనివారు ఒక్కరైనా ఫిర్యాదు చేశారా?
- స్కూలు కూడా నా సొంత ఖర్చులతో నిర్వహిస్తున్నాను
- నా సొంత ఇల్లు, ఎస్టేట్ అన్నీ సమాజ సేవ కోసమే
- వారు చెప్పిన సర్వే నంబర్లలోని భూములు మా ఆధీనంలో లేవు
- ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి. చిత్రంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్

కడప కార్పొరేషన్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయ దురుద్దేశంతోనే ఎల్లో మీడియా తప్పుడు కథనాలు ప్రచురించిందని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా పరిషత్ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పూర్వకాలం నుంచి తమది పెద్ద వ్యవసాయ కుటుంబమని, తమ తాతగారి హయాం నుంచి చుట్టూ ఉన్న పది గ్రామాలను ఆదరిస్తూ సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. తనకు గ్రామీణ వాతావరణం అంటే ఇష్టమైనందునే ఆకేపాడులో ఇల్లు కూడా నిర్మించుకున్నానన్నారు. తమ ఎస్టేట్ చుట్టూ ఆరు గ్రామాలున్నాయని, ఈ గ్రామాల్లోని వారు ఏ ఒక్కరు ఫిర్యాదు చేసినా ఆ భూమి వారికే రాయించి ఇస్తానన్నారు. ఆకేపాడు చుట్టుప్రక్కల గ్రామాలకు చెందిన ఏ ఒక్కరు భూమి కోల్పోయినట్లు ఫిర్యాదు చేయలేదు. కానీ ఎక్కడో 20కిలోమీటర్ల దూరంలో ఉండే టీడీపీ నాయకుడు సుబ్రమణ్యంనాయుడు 'స్పందన'లో ఫిర్యాదు చేస్తే ఎల్లో మీడియా భుజానికి ఎత్తుకుందని మండిపడ్డారు. సర్వేనంబర్ 739, 1041లో తమ భూములు లేవన్నారు. సర్వే నంబర్లు 556/1, 556/2 లలో భూములు ఉన్నట్లు రాశారని..వాస్తవానికి 556 సర్వేనంబర్ ఇంకా సబ్ డివిజన్ కాలేదన్నారు. తమది ఉమ్మడి కుటుంబమని, ఎక్కడెక్కడ ఏఏ సర్వేనంబర్లలో భూములు ఉన్నాయో తనకు తెలియదన్నారు. సామాజిక, రాజకీయ, ఆధ్యాత్మిక విషయాలపైనే తనకు మక్కువని వివరించారు. ఇరవై ఏళ్ల క్రితం తాను గుడి నిర్మించేటప్పుడు ఆ ప్రాంతమంతా అడవిగా ఉండేదని.. ప్రస్తుతం అక్కడ వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి, సాయిబాబా గుడులు నిర్మించామన్నారు. ఆ గుళ్లలో ధూప, దీప నైవేద్యాన్నింటికీ ఖర్చు తానే భరిస్తున్నానన్నారు. నిత్యం అన్నదానం నిర్వహిస్తూ ప్రతి ఏటా వందల పెళ్లిళ్లు నిర్వహిస్తుంటానన్నారు. తన ఇల్లు కూడా సమాజ సేవకే అంకితమని, రూ.50లక్షలు విలువజేసే ఆ ఇంటిలో వృద్ధాశ్రమం పెట్టే యోచన ఉందన్నారు. తమ స్వంత స్థలం సర్వే నంబర్ 26/1బీలో టీటీడీ ఆధ్వర్యంలో కళ్యాణ మండపం నిర్మిస్తున్నామని, అలాగే 68/1ఏలో రూ.3.50కోట్లతో వ్యవసాయ గోడౌన్‌కు టెండర్లు పూర్తయ్యాయన్నారు. అదే సర్వేనంబర్‌లో కంటి ఆస్పత్రి నిర్మించేందుకు రోటరీ క్లబ్‌కు ఎకరా భూమి అప్పగించామని, శ్మశానానికి కూడా ఎస్టేట్‌లోనే భూమి ఇచ్చామని ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఆకేపాడు తనకు జన్మనిచ్చిన ప్రదేశమని, దాని రుణం తీర్చుకునేందుకు తాను ప్రయత్నిస్తున్నానన్నారు.

సేవాదృక్పథంతోనే పాఠశాల నిర్వహణ

జన్మనిచ్చిన పల్లెలోనే సరైన వసతులు లేకపోవడంతో 30 ఏళ్లక్రితం అక్కడ స్వంత ఖర్చులతో స్కూలు నిర్మించానన్నారు. ఐదుగురు నిరుద్యోగులకు అప్పగించి ప్రతినెలా జీతాల కోసమే రూ.50వేలు ఇస్తున్నానన్నారు. పాఠశాల నిర్వహణకు ఎవరు ముందుకొచ్చినా ఉచితంగా ఇచ్చేస్తానన్నారు. హార్స్ రైడింగ్, స్విమ్మింగ్ అంటే తనకు ఇష్టమని.. ఆరోగ్యం కోసం అలా చేస్తుంటానని తెలిపారు. గ్రామంలో ఉన్న తన ఇల్లు, భూములు భవిష్యత్‌లో ట్రస్టుకు ఇవ్వాలనే యోచనలో అన్నదమ్ములం ఉన్నామని ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆకేపాడును మండల కేంద్రంగా ప్రకటిస్తే మరో 10 ఎకరాలు సొంత స్థలాన్ని ప్రభుత్వ కార్యాలయాల కోసం ఇచ్చేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్ కూడా పాల్గొన్నారు.

తెల్లబోయిన పల్లె

- పొలం పక్కన అన్నం తింటున్న రైతులపైకి దూసుకొచ్చిన టిప్పర్
- ఇద్దరు రైతులు సహా టిప్పర్ డ్రైవర్ దుర్మరణం
- మూడు కుటుంబాల్లో విషాదం

జమ్మలమడుగు రూరల్: పొలం పనుల పొట్టకూటి కోసం పొలం పనికి వెళ్లిన ఇరువురు అన్నదాతలను అకాల మృత్యువు ప్రమాద రూపంలో కబళించింది. పొలంలో పనిచేసి అలసి.. ఆకలి తీర్చుకునేందుకు భోజనానికి సిద్ధమైన వారిపైకి ఉన్నట్లుండి టిప్పర్ దూసుకురావడంతో ఇద్దరు అన్నదాతలు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటనలో టిప్పర్ డ్రైవర్ కూడా మృతి చెందాడు. రైతులు అన్నం తింటున్న తెల్లైతోపాటు చెల్లాచెదురుగా పడిన శరీర అవయవాలతో ఆ ప్రదేశం రక్తసిక్తమైంది. ఒక రోడ్డు ప్రమాదం మూడు కుటుంబాల్లో విషాదం నింపిన ఈ హృదయ విదారక సంఘటన జమ్మలమడుగు– ప్రొద్దుటూరు జాతీయ రహదారిపై ధర్మాపురం సమీపంలో గురువారం మధ్యాహ్నం చోటు చేసుకొంది.

ఎద్దులతోనే జీవనం సాగిస్తూ..

మృతుల్లో ఒకరైన ఎనగలూరు ఓబులేసుది జమ్మలమడుగు మండలం గొరిగెనూరు గ్రామం. వ్యవసాయ కూలీ. కుటుంబ పోషణ కోసం తనకున్న కాడెద్దులతో రైతుల పొలాలకు సేద్యానికి వెళుతుంటాడు. గురువారం ధర్మాపురానికి చెందిన రైతు యనమల నాగ సుబ్బారెడ్డి వరి పొలంలో సేద్యం చేసేందుకు వెళ్లాడు. మధ్యాహ్నం సమయంలో రోడ్డు వారన అన్నం తింటుండగా ఉన్నట్లుండి టిప్పర్ మృత్యు శకటంలా దూసుకురావడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ యాజమాని ఆకస్మిక మరణంతో ఆ ఇంట రోదనలు మిన్నంటాయి.



రైతు నాగ సుబ్బారెడి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

నేల తల్లి ఒడిలోనే..

జమ్మలమడుగు మండలం ధర్మాపురం గ్రామానికి చెందిన యనమల నాగ సుబ్బారెడ్డికి భార్య ఇద్దరు కూమార్తెలు ఒక కుమారుడు ఉన్నారు. 60 ఏళ్ల వయసులోనూ తనకున్న 6 ఎకరాల పొలంలో వరి పంట పండిస్తున్నాడు. ఈ ప్రమాదంలో దుర్మరణం చెందాడు. తన పక్కనే కొడుకు, మనవడు ఉన్నప్పటికీ వారు తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే నాగ సుబ్బారెడ్డి మరణ వార్త విని ధర్మాపురం గ్రామం కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.

ఇద్దరి మృతికి కారణమై..

ఇద్దరి మృతికి కారణమైన టిప్పర్ డ్రైవర్ విజయ కుమార్ జీవితం కూడా విషాదంగా ముగిసింది. జమ్మలమడుగు మండలం ఎస్. ఉప్పలపాడు గ్రామానికి చెందిన ఇతను ఇటీవల కొంత కాలంగా దేవగుడికి చెందిన టిప్పర్‌కు డ్రైవర్‌గా వెళుతున్నాడు. ఈ క్రమంలో జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరు వైపు వెళుతూ మార్గమధ్యంలో వాహనాన్ని పొలంలోకి తీసకెళ్లాడు. గుండెపోటుకు గురయ్యాడా.. లేక మూర్ఛ వచ్చిందా.. నిద్రమత్తా.. నిర్లక్ష్యమా.. అనారోగ్యమా.. కారణం తెలియదు గానీ తాను నడుపుతున్న వాహనం అదుపుతప్పడంతో ఇద్దరు రైతులతో పాటు తను కూడా మృతి చెందాడు. విజయకుమార్‌కు భార్య ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నారు. ఇతని ఆకాల మరణంతో ఎస్. ఉప్పలపాడు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

నిర్ణీత సమయానికి స్టేడియం నిర్మాణ పనులు

ఏసీఏ సీఈఓ వెంకట శివారెడ్డి



పులివెందులలో క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఏసీఏ సీఈఓ వెంకటశివారెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్: పులివెందులలో నిర్మిస్తున్న క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని ఏసీఏ సీఈఓ వెంకట శివారెడ్డి పేర్కొన్నారు. గురువారం పులివెందులలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి క్రికెట్ స్టేడియం నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పులివెందుల క్రికెట్ క్రీడాకారుల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రికెట్ స్టేడియం నిర్మించడం అభినందనీయమన్నారు. ఇప్పటికే గ్రౌండ్ నిర్మాణం పూర్తయిందని.. పచ్చిక పనులు చేపడుతున్నామన్నారు. స్టేడియం నిర్మాణం పూర్తయితే పులివెందుల నియోజకవర్గంతోపాటు సత్యసాయి, అనంతపురం, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు క్రీడాకారులకు ఎంతో అనువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ వీరభద్రారెడ్డి, జిల్లా అసోసియేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

పుల్లంపేట : ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడమే తమ బ్యాంక్ లక్ష్యమని పుల్లంపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ (ఏపీజీబీ) చైర్మన్ రాకేష్ కశ్యప్ పేర్కొన్నారు. గురువారం పుల్లంపేటలోని ఏపీజీబీలో ఖాతాదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోనే పుల్లంపేట ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు రూ. 105 కోట్లు లావాదేవీలు నిర్వహించిందని, ఈ మొత్తంలో రూ. 57 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయగా, మిగిలిన రూ. 48 కోట్లు ఖాతాదారులకు రుణాలు మంజూరు చేశామన్నారు. 2001 జూలై నెలలో ప్రారంభించిన బ్యాంక్ పుల్లంపేట మండలంలోనే లావాదేవీల్లో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో రాజంపేట రీజనల్ బ్యాంక్ మేనేజర్ రమణ, పుల్లంపేట బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, సీనియర్ మేనేజర్ భాస్కర్ రెడ్డి, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఉత్సాహం.. ఉత్తేజం

– ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్ : క్రీడల్లో పాల్గొనడం ద్వారా ఉల్లాసం, ఉత్సాహంతో పాటు ఉత్తేజం కలుగుతుందని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి. అంజద్‌బాషా పేర్కొన్నారు. గురువారం కడప నగరంలోని డీఎస్ఏ క్రీడామైదానంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా స్టెప్, ధ్యాన్‌చంద్ హాకీ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో హాకీ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. క్రీడలు స్నేహ భావాన్ని పెంపొందిస్తాయన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్, ధ్యాన్‌చంద్ అకాడమీ డైరెక్టర్ సుభాన్‌బాషా మాట్లాడుతూ క్రీడాకారులు ఆటలో క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. అనంతరం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. బాలికల విభాగంలో రాయచోటి జట్టు విన్నర్స్‌గా, కడప జట్టు రన్నరప్‌గా నిలిచింది. బాలుర అండర్–14 విభాగంలో రాయచోటి జట్టు విన్నర్స్‌గా, కడప జట్టు రన్నరప్‌గా నిలిచింది. సీనియర్స్ విభాగంలో కడప జట్టు విజేతగా, రాయచోటి రన్నరప్‌గా నిలిచింది.

అక్రమనిర్మాణాలపై ఆర్డీఓ ఆగ్రహం

- హెచ్చరిక బోర్డు తొలగింపుపై క్షేత్రస్థాయిలో పరిశీలన
- నిర్లక్ష్యం వహించిన వీఆర్వో, సెక్రటరీపై చర్యలకు ఆదేశాలు



వీఆర్వో శంకర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : కోళ్లబైలు పంచాయతీలోని ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ ఆగ్రహం వ్యక్తం చేశారు. హెచ్చరిక బోర్డు తొలగించి అక్రమనిర్మాణాలు శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ సీకే.శ్రీనివాసులుతో కలిసి ఆర్డీఓ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనుమతి లేకుండా చేస్తున్న నిర్మాణాలపై చర్యల్లో భాగంగా రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేస్తే తొలగించడమేంటని ఆక్రమణదారులను ప్రశ్నించారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తుంటే..ప్రభుత్వస్థలంలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు జరపడమేంటని నిలదీశారు. కోళ్లబైలు సర్వేనంబర్.889–5, 891–1లోని 1.73 ఎకరాల భూమిని వ్యవసాయేతర అవసరాలకు వినియోగిస్తున్నట్లు తేలడంతో పీఓటీ చట్టం కింద స్వాధీనం చేసుకుంటూ రైతుకు నోటీసులు అందజేశామన్నారు. ప్రభుత్వ స్థలంలో ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాలను ఎక్కడివక్కడ నిలిపేయాలని, ఇకపై నిర్మాణాలు చేస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వస్థలాన్ని వ్యవసాయం కోసమని పట్టా పొంది అక్రమంగా ప్లాట్లు వేసి విక్రయిస్తున్నా.. వీఆర్వో శంకర్ చర్యలు తీసుకోకుండా ఉపేక్షించడంపై మెమో ఇవ్వాల్సిందిగా తహసీల్దార్‌ను ఆదేశించారు. అనుమతి లేకుండా నిర్మాణాలు జరుపుతుంటే అడ్డుకోవాల్సింది పోయి, కరెంట్ కనెక్షన్‌కు అనుమతి మంజూరుచేసినందుకు పంచాయతీ సెక్రటరీ సురేంద్రపై సస్పెన్షన్‌కు సిఫారసు చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మురళీ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అనుమతి లేకుండా నిర్మాణాలు జరుపుకుంటూ వెళితే భవిష్యత్తులో ప్రజావసరాలకు మదనపల్లె పరిసరాల్లో భూములు మిగలవన్నారు. ఇప్పటికే పట్టణ శివారు ప్రాంతాల్లో పలు ప్రభుత్వభూములు అన్యాక్రాంతమయ్యాయని, మిగిలిన వాటినైనా కాపాడుకునే దిశగా రెవెన్యూ అధికారులు చొరవ చూపాలన్నారు. హెచ్చరిక బోర్డు తొలగింపుపై పత్రికల్లో గురువారం వార్తలు వచ్చిన నేపథ్యంలో రెవెన్యూసిబ్బంది ఆర్డీఓ పరిశీలనకు ముందు తిరిగి బోర్డును ఏర్పాటుచేశారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ హెచ్చరిక బోర్డు తొలగించినా, నిర్మాణాలు జరిపినా చర్యలు తప్పవని మరోమారు ఘాటుగా హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ముద్దుకృష్ణ, సర్వేయర్ ముబారక్, ఏపీఎస్పీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ రెడ్డి, తాలూకా ఎస్ఐ సుధాకర తదితరులు పాల్గొన్నారు.

పశువులను మేపొద్దన్నందుకు దాడి

నిమ్మనపల్లె : తమ పొలంలో పశువులు మేపొద్దన్నందుకు మహిళపై దాడి చేసిన సంఘటన నిమ్మనపల్లె మండలంలో గురువారం జరిగింది. ఎస్.ఐ ఫాతిమా కథనం మేరకు ముష్టూరు పంచాయతీ పారేసువారిపల్లెకు చెందిన నరసింహులు భార్య శారద ఈ నెల 10న వేరుశనగ పొలం వద్ద పని చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన అంజి భార్య నరసమ్మ పశువులు శారద పొలంలోకి వెళ్లాయి. పంట నాశనం చేస్తున్నాయని పశువులు పక్కకు తోలమంటూ నరసమ్మకు చెప్పింది. ఈ క్రమంలో వాగ్వివాదం జరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఘర్షణలో భాగంగా నరసమ్మ తన వద్దనున్న కొడవలి శారదపైకి విసరగా ఆమె చెయ్యి అడ్డుపెట్టడంతో తీవ్ర రక్తగాయాలయ్యాయి. బాధితురాలు మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం గురువారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాయచోటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాయంలో 'విజిలెన్స్' తనిఖీ

రాయచోటిటౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా విజిలెన్స్ అధికారుల తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు నిర్వహించారు. గురువారం విజిలెన్స్ అధికారి రామకృష్ణ తన సిబ్బందితో కలసి రికార్డులు పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టాంపులు అధిక ధరలకు అమ్ముతున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. దీనిపై తనిఖీ చేశామని, నివేదికలు ఉన్నతాధికారులకు సమర్పిస్తామని ఆయన చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



గాయపడిన వారిని 108 సహాయంతో ఆసుపత్రికి తీసుకెళుతున్న దృశ్యం

సంబేపల్లె : కర్నూలు– చిత్తూరు జాతీయ రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు శెట్టిపల్లె పంచాయతీ యర్రమోరంపల్లెకు చెందిన సాయికుమార్ సొంతపనుల నిమిత్తం కలకడకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మండలంలోని గుట్టపల్లె సమీపంలో రాగానే చిత్తూరు నుంచి వస్తున్న కారు బైక్‌ను ఢీకొంది. ఈ క్రమంలో ముక్కలైన బైక్ పక్కనే వెళుతున్న ఆటోపై పడింది. దీంతో ఆటోలో వెళ్లుతున్న నరసింహులు, మరోముగ్గురు, సాయికుమార్ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 సహాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షరీఫ్ తెలిపారు.

గండి అంజన్న సన్నిధిలో వ్యవసాయశాఖ సెక్రటరీ

చక్రాయపేట : గండిక్షేత్రంలో వెలసిన వీరాంజనేయ స్వామిని గురువారం రాష్ట్ర వ్యవసాయశాఖ సెక్రటరీ రామారావు దర్శించుకున్నారు.ఆలయ సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన,ఉప ప్రధాన,ముఖ్య అర్చకులు కేసరి,రాజారమేష్, రాజగోపాలాచార్యులు ఆయనతో పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఆలయ చరిత్ర గురించి వినిపించారు.

సకాలంలో ఆదాయపన్ను రిటర్న్స్ దాఖలు చేయాలి



ఆదాయపు పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్

రాయచోటి : టీడీఎస్ రిటర్న్స్‌ను నిర్దేశించిన సమయంలోగా డీడీఓలు, ఉద్యోగులు సరైన పద్ధతిలో దాఖలు చేయాలని ఆదాయపు పన్ను శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో టీడీఎస్, టీసీఎస్ నిబంధనలపై అన్ని శాఖల డ్రాయింగ్ అండ్ డిస్బర్సుమెంట్(డీడీఓ) అధికారులకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదాయపన్ను రిటర్న్స్‌ను సకాలంలో చేయకుంటే సంబంధిత డీడీఓలపై పెనాల్టీ పడుతుందన్నారు. ఉద్యోగులు ఇన్‌కమ్ టాక్స్ రిటర్న్స్ ఎన్నో తప్పులతో ఫైలింగ్ చేస్తున్నారన్నారు. అలా చేయకుండా సరిగ్గా ఫైలింగ్ చేయాలన్నారు. ఇన్‌కమ్‌టాక్స్‌లోని 192, 194–సి, 194–హెచ్, 194–జె, 194–ఎల్ఏ సెక్షన్లపై అవగాహన కల్పించారు. సమావేశంలో ఆదాయపు పన్ను శాఖ అధికారి రాజశేఖర్, ఇన్‌స్పెక్టర్ కృష్ణప్రసాద్ తదిరతులు పాల్గొన్నారు.

ప్రజాక్షేత్రంలో రెండు నెలల పాదయాత్ర

ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు



మాట్లాడుతున్న ఏపీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు

మదనపల్లె : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా క్షేత్రస్థాయిలో పోరాటం చేయాలని నిర్ణయించినట్లు ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తెలిపారు. ఇందులో భాగంగా జనవరి 26 నుంచి మార్చి 26 వరకు రెండు నెలల పాటు రాష్ట్రంలో పాదయాత్ర జరపాలని తీర్మానించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలోపేతంలో భాగంగా జరుపుతున్న పర్యటనలో గురువారం ఆయన మదనపల్లెకు వచ్చారు. మాజీ ఎమ్మెల్యే, ఏపీసీసీ కోఆర్డినేషన్ కమిటీ మెంబర్ షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గస్థాయి కార్యనిర్వాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ.. ఏఐసీసీ ఉపాధ్యక్షులు రాహుల్‌గాంధీ దేశంలో నిర్వహిస్తున్న భారత్ జోడో యాత్రకు ప్రజల నుంచి అనూహ్యస్పందన లభిస్తోందన్నారు. దేశ, రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని అన్నారు. బీసీల జనాభా లెక్కతేల్చేందుకు దేశంలోని బీహార్, ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న విధంగా రాష్ట్రంలో బీసీ జనగణన జరపాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మయప్పన్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగాగౌతమ్, నాగమధుయాదవ్, షంషీర్, నాగూర్‌వల్లీ, వేమయ్య, గిరీష్, రెడ్డిసాహెబ్, ఇంతియాజ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

పాపను కాపాడబోయి..
ప్రాణాలు వదిలాడు

జిల్లా హాకీ కార్యదర్శి గిరి మృతి



గిరిరావు (ఫైల్)

మదనపల్లె సిటీ : నీటి కుంటలో మునిగిపోతున్న పాపను కాపాడబోయి జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శి, బీటీ కాలేజీ పూర్వపు ఫిజికల్ డైరెక్టర్ లెక్కల గోవర్ధన గిరిరావు(53) గురువారం మృతి చెందాడు. దీంతో క్రీడాకారుల్లో విషాదం నెలకొంది. మదనపల్లె పట్టణం కృష్ణానగర్‌కు చెందిన గోవర్ధన గిరిరావు జిల్లా హాకీ అసోసియేషన్ కార్యదర్శిగా ఉన్నారు. భార్య జలజ తంబళ్లపల్లె మండలం కన్నెమడుగు జెడ్పీ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. సెలవులు కావడంతో తనతో పాటు పాఠశాలలో పని చేసే హిందీ టీచర్ దీప,ఫిజికల్ సైన్సు టీచర్ ఇంద్రాణి కుటుంబసభ్యులతో కలిసి ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండకు వెళ్లారు. దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణంలో మదనపల్లె–చౌడేపల్లె మార్గంలోని ఓ ఫామ్‌హౌస్ వద్ద వంటలు చేసుకునేందుకు వెళ్లారు. వీరితో పాటు వెళ్లిన పిల్లలు సరదాగా ఫామ్ హౌస్‌లో ఆడుకుంటుండగా హిందీ టీచర్ కుమార్తె లాస్య ప్రమాదవశాత్తు నీటికుంటలో పడటంతో కేకలు వేసింది. గమనించిన గిరిరావు వెంటనే లాస్యను కాపాడేందుకు నీటికుంటలో దూకాడు. నీటి కుంట బురదమయమై ఉండటంతో ఇరుక్కుపోయాడు. ఆందోళనతో గుండెపోటుకు గురై మృతి చెందాడు.నీటి కుంటలో గిరిరావు ఇరుక్కపోవడాన్ని గమనించిన పిల్లలు కేకలు వేయడంతో, పరిసర ప్రాంతాల వారు అక్కడికి చేరుకుని ఆయన్ను వెలికితీశారు. స్థానికులు 108కు సమాచారం ఇచ్చి, ప్రాథమిక చేసినప్పటికి గిరిరావు మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, భార్య జలజ, కుమారుడు జస్వంత్‌లు ఆయన మృతిని తట్టుకోలేక బోరున విలపించారు. శుక్రవారం కురబలకోట మండలం కంటేవారిపల్లె వద్ద వ్యవసాయక్షేత్రంలో అంత్యక్రియలు జరగనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ

గిరిరావు మృతి చెందిన విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే నవాజ్‌బాషా గిరిరావు ఇంటికి చేరుకుని కుటుంబసభ్యులను ఓదార్చారు. మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి ,బీటీ కాలేజీ కరస్పాండెంట్ వై.ఎస్.మునిరత్నం, దివ్యభారతి ప్రసాద్‌రెడ్డి, జ్ఞానాంబిక డిగ్రీ కాలేజీ కరస్పాడెంట్ రాటకొండ గురుప్రసాద్, సాయిశేఖర్‌రెడ్డి, పీడీలు భౌతికకాయాన్ని సందర్శించి విచారం వ్యక్తం చేశారు.

15 నుంచి పీరయ్యస్వామి ఆరాధనోత్సవాలు



పీరయ్యస్వామి జీవసమాధి

చిన్నమండెం : మండల పరిధిలోని చిన్నర్సుపల్లె గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ సద్గురు చిన్నమండెం పీరయ్య స్వాముల వారి 217వ ఆరాధన మహోత్సవాలు ఈ నెల 15వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరగుతాయని నిర్వాహకులు తెలిపారు.వైఎస్సార్ జిల్లా పోరుమామిళ్ల సమీపంలోని శంఖవరం గ్రామంలో దేవాంగ కులస్తులైన పోతయ్య, పాపులమ్మ పుణ్యదంపతులకు పీరయ్యస్వామి జన్మించారు. ఈ దంపతులు వీరబ్రహ్మేంద్రస్వామి ప్రియ శిష్యుడైన సిద్ధయ్య భక్తులు. ఆ కారణం చేతనే వీరు దేవాంగులైనప్పటికీ కుమారునికి పీరయ్య అని పేరు పెట్టుకున్నారు. సిద్ధయ్యస్వామి నాలుగో కుమారుడు పెద్దపీరయ్య. ఆయన కుమారుడు బాబయ్య, ఆయన కుమారుడు బాలసిద్దయ్య. ఆ బాలసిద్ధయ్య గారే పీరయ్య స్వామికి గురువులు. ఆయన దగ్గర వేదవేదాంగాలు, ఆధ్యాత్మిక విషయాలు, ఎంతో గోప్యమైన అచల రాజయోగ రహస్యాలన్నీ అభ్యసించారు.

ఆరాధనోత్సవ వివరాలు:

ఈ నెల 15న సాయంత్రం 5 గంటలకు స్వామి వారికి అభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు జరుగుతాయి. రాత్రి 8 గంటలకు పీరయ్యస్వామి చరిత్ర ప్రముఖ సంగీతావధాని, మఠం ఆస్థానకవి యలమర్తి మధుసూధన బృందంచే గేయరూపంలో ప్రదర్శన. రాత్రి 9 గంటల నుంచి అఖండ భజన, రాత్రి 10 గంటల నుంచి ఎన్‌పీ కుంటకు చెందిన కీబోర్డ్ మాస్టర్, తబలిస్టు బావాజీచే సాసవల చిన్నమ్మ కథ డ్రామా. 16వ తేదీ ఉదయం 6 గంటలకు మౌలాలి జెండా మెరవణి జరగుతుంది. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మదనపల్లె మండలంలో గురువారం జరిగాయి. బసినికొండ శివాలయం వద్ద నివాసమున్న రమేష్ భార్య ఎం.మల్లీశ్వరి(24) కుటుంబ సమస్యలతో ఫినాయిల్ తాగింది. బసినికొండ నిమ్మనపల్లె రోడ్డు అంబేద్కర్ కాలనీలో నివాసం ఉంటున్న నరసింహులు కుమారుడు కె.కదిరప్ప (50) కుటుంబ సమస్యలతో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు వీరిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురికి తీవ్ర గాయాలు

మదనపల్లె : వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గురువారం పట్టణంలోని దేవతానగర్‌లో నివాసమున్న నాగరాజు కుమారుడు ఎం.అమరనాథ్ (40) దేవతానగర్ వద్ద మద్యం మత్తులో ద్విచక్రవాహనంలో వస్తూ అదుపు తప్పి రోడ్డుపై పడ్డాడు. తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పుంగనూరు పట్టణం యూబీ కాంపౌండ్‌లో నివాసం ఉంటున్న ఇస్మాయిల్ కుమారుడు తౌసిఫ్ (18) స్థానికంగా ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. గురువారం మరో స్నేహితుడితో కలిసి ద్విచక్రవాహనంలో మదనపల్లెకు వస్తుండగా మదనపల్లె సమీపంలోని జ్యూస్‌ఫ్యాక్టరీ వద్ద గుర్తు తెలియని గ్రే కలర్ కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొని వెళ్లిపోయింది. తౌసిఫ్ తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పుంగనూరు పట్టణం ప్రకాష్‌నగర్ కాలనీ ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నివాసం ఉంటున్న ఆర్.రమణ భార్య ఆర్.కవిత(30) స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయాగా పని చేస్తోంది. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని రోడ్డుపై నడిచి వస్తుండగా ద్విచక్రవాహనం వేగంగా ఢీ కొనండతో తీవ్రంగా గాయపడింది. గమనించిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పుంగనూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితులను కలిసేందుకు వెళుతూ..

– ట్రాక్టర్ ఢీకొని ఇంజినీరింగ్ విద్యార్థి మృతి



ఇంజనీరింగ్ విద్యార్థి సోహైల్ మృతదేహం

మదనపల్లె : ట్రాక్టర్ ఢీ కొని ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందిన సంఘటన గురువారం పెద్దతిప్పసముద్రం మండలంలో జరిగింది.మల్లెల గ్రామానికి చెందిన ఫయాజ్ రెండో కుమారుడు ఎస్.సోహైల్ (21) బెంగళూరులో మెకానికల్ ఇంజినీరింగ్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు గురువారం సాయంత్రం బి.కొత్తకోటలోని స్నేహితులను కలిసేందుకు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మార్గమధ్యలో మల్లెల కాలనీ వద్ద ఎదురుగా వచ్చిన ట్రాక్టర్ బైక్‌పై వెళుతున్న సోహైల్‌ను ఢీ కొంది. ప్రమాదంలో బాధితుడు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. విద్యార్థి మృతదేహాన్ని చూసి కుటుంబసభ్యులు బోరున విలపించారు. పీటీఎం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేంపల్లె వీఆర్వో రెడ్డిరాణిపై సస్పెన్షన్ ఎత్తివేత

మదనపల్లె : మండలంలోని వేంపల్లె పంచాయతీ గ్రేడ్–2 వీఆర్వో రెడ్డిరాణిపై సస్పెన్షన్ రద్దుచేస్తూ విధుల్లోకి చేరాల్సిందిగా గురువారం జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఉత్తర్వులు ఇచ్చారు. వేంపల్లె రెవెన్యూ గ్రామం, చీకలబైలు క్లస్టర్ పరిధిలో 44 మ్యుటేషన్ దరఖాస్తులకు సంబంధించి దీర్ఘకాలికంగా పరిష్కరించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం కనబరిచినందుకు క్రమశిక్షణా చర్యల్లో భాగంగా గత ఏడాది నవంబర్ 14న రెడ్డిరాణిని జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. అనంతరం విచారణ అధికారిని నియమించి నివేదిక ఇవ్వాలని కోరారు. అన్ని కోణాల్లో సమగ్రంగా విచారణ జరిపిన తర్వాత చిన్నపాటి శిక్షతో సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించుకుంటూ తక్షణమే ఆమెను విధుల్లోకి చేరాల్సిందిగా ఆదేశించారు.